# సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- ధరణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

అమ్మాయిపల్లిలో పర్యటించి డ్రైడేను పరిశీలిస్తున్న కలెక్టర్

చిన్నంబావి, జూన్ 28 : వానకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంతోపాటు అమ్మాయిపల్లి, వెల్టూరు గ్రామాల్లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని, గ్రోమోర్ రైతు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అదేవిధంగా అమ్మాయిపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న మౌలిక వసతుల కల్పన పనులను పరిశీలించి , డ్రైడే ఫ్రైడే సందర్భంగా ఇండ్ల దగ్గరికి వెళ్లి కుళాయిలు, నీటి సంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాసీల్దార్ కార్యాలయంలోని ధరణి ఫిర్యాదులను పరిశీలించి తాసీల్దార్ లాగిన్‌లో వచ్చిన వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి కుళాయిలను, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని గ్రోమోర్ రైతు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎల్పీవో రఘునాథ్‌రెడ్డి, తాసీల్దార్ ఎండీ ఇక్బాల్, ఎంపీడీవో రమణారావు, వ్యవసాయ అధికారులు డాకేశ్వర్‌గౌడ్, డీటీ శ్రీనివాస్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఎంపీవో రామస్వామి, ఏపీవో ధనుంజయ్‌రాజ్, ఆర్ఐ రాము, కార్యదర్శులు, ఉన్నారు.

**పరిసరాలను శుభ్రం చేసుకోవాలి**

వీపనగండ్ల, జూన్ 28 : వానకాలంలో నిల్వనీరు లేకుండా పరిసరాలను శుభ్రం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మండలకేంద్రంతో పాటు మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలో నిల్వ నీరు వంటి అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మప్ప, డీపీఆర్వో సీతారాం నాయక్, ఏపీవో శేఖర్ గౌడ్, ఏఈ తేజ, నాయబ్ తాసీల్దార్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

**సిజేరియన్ ప్రసవాలను నివారించాలి**

వనపర్తి టౌన్, జూన్ 28 : వనపర్తి జిల్లాలో సిజేరియన్ ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయని వీటిని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్య శాఖ అధికారులు, వైద్యులతో సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీ, ప్రైవేట్ దవాఖానల్లో జరుగుతున్న ప్రసవాలు, సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. సాధారణ ప్రసవాలు ఎక్కువ జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాశాఖ అధికారి జయచంద్రమోహన్, మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం**

వనపర్తి జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి నార్కోటిక్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. జిల్లాలో గంజాయి సాగు, మాదకద్రవ్యాలు వాడుతున్న వారి కేసుల ఆరా, వివరాలను సేకరించారు. జిల్లాలో గంజాయి సాగు చేసిన వారిపై 3 కేసులు, వినియోగించిన వారిపై 17 కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ కృష్ణ కిశోర్ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, ఆర్డీవో పద్మావతి, అబ్కారీ శాఖ అధికారి ప్రభువినయ్, రవాణా శాఖ అధికారి మానస, డీఈవో గోవిందరాజులు ఉన్నారు.

## ఉపాధ్యాయవృత్తి ఎంతో కీలకమైనది

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 28 : ఉపాధ్యాయవృత్తి ఎంతో కీలకమైందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన ఎంఈవో రాజు పదవీ విరమణ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్‌తో కలిసి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఉద్యోగవిరమణ ఉపాధ్యాయవృత్తిలో కీలక అంశమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పైరవీకారులను నమ్మొద్దు

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పెద్దమందడిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దమందడి, జూన్ 28 : కల్యాణలక్ష్మి చెక్కులను ఇప్పిస్తామని చెబుతూ డబ్బులు వసూలు చేసే పైరవీకారుల మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్క హామీని నెరవేర్చేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. జూలై నెల తర్వాత కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు తులం బంగారం ఇచ్చేందుకు కసరత్తు చేస్తుందని, మండలంలో 36మందికి కల్యాణలక్ష్మి చెక్కులను మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ పీ రఘుప్రసాదవ్, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ భారతి, సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో సద్గుణ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు ఉన్నారు.

**గ్రామాలను పరిశుభ్రంగా ఉండాలి**

గ్రామాల్లో ప్ర త్యేక అధికారులు, కార్యదర్శులదే కీలక పాత్ర ఉంటుందని, గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రఘుప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథులుగా జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కార్యక్రమం లో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎంపీపీ రఘుప్రసాద్, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, వైస్‌ఎంపీపీ భారతి, సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, అధికారులు తదితరులు ఉన్నారు.

## ఎన్‌సీసీతో దేశభక్తి పెరుగుతుంది

ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కల్నల్ ఎస్‌కే సింగ్

గద్వాలటౌన్, జూన్ 28 : ఎన్‌సీసీలో చేరడంతో దేశభక్తితోపాటు క్రమశిక్షణ అలవడుతుందని ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ ఎస్‌కే సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ నూతన యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీలో చేరడంతో పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో దేశభక్తి అలవడుతుందన్నారు. అంతేకాక భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు సులభంగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పాఠశాలలో ఎన్‌సీసీని ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటనర్సయ్య, పాఠశాల ఎన్‌సీసీ ఇన్‌చార్జి రాముడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని కాపాడుకుందాం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

సభలో మాట్లాడుతున్న జంగయ్య

చిన్నంబావి, జూన్ 28 : విద్యారంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అ ధ్యక్షుడు జంగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పునూరు హెచ్‌ఎం నర్సింహులు ఉద్యోగ విరమణ సభను ఏర్పాటు చేశారు. సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యారంగం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయని వాటిని మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్రనాయకుడు కిల్లెగోపాల్, రైతు సంఘం రాష్ట్రఉపాధ్యక్షుడు రాములు, యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి రవిప్రసాద్‌గౌడ్, జిల్లాప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రామమ్మ, ఎంపీటీసీ లక్ష్మి, కేపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యంరాజు తదితరులు ఉన్నారు.

## కేసీఆర్ హయాంలోనే పల్లెలకు పెద్దపీట

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి

అయిజ, జూన్ 28 : కేసీఆర్ హయాంలోనే పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ మండలాభివృద్ధే ధ్యేయంగా ఐదేండ్లు కృషి చేశామని ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో సమావేశహాలులో చివరి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం పీపీ మాట్లాడుతూ .. కేసీఆర్ హయాంలో పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ నిధులు విడుదల చేయడంతో పల్లెలు ప్ర గతి పథంలో నడిచాయని పేర్కొన్నారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సహకారంతో మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామని తెలిపారు. మండలంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలను అధికారులు సన్మానించారు. సమావేశంలో వైస్ ఎం పీపీ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీవో నర్సింహారెడ్డి, ఎంఈవో నర్సింహులు, ఏవో శంకర్‌లాల్, ఏఈఓలక్ష్మన్న, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రైవేటీకరణను విరమించుకోవాలి

అమరచింత, జూన్ 28 : సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ చేసేందుకు బీజేపీ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తుందని, తక్షణమే ఆ ఆలోచనను విరమించుకుని సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు అజయ్, రమేశ్, వెంకటేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ఆలోచనను విరమించుకోవాలని సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు.కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల టౌన్, జూన్ 28 : నేషనల్ హెల్త్ ప్రోగ్రాం కింద కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన 50పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశికళ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వీసీసీఎంఎల్ ఒక పోస్టు, ఎంఎల్‌పీహెచ్, సీహెచ్‌వో, ఎంవో పల్లె దవాఖానలో 16 పోస్టులు, స్టాఫ్ నర్సులు 10మంది, ఎన్‌సీడీ స్టాఫ్ నర్సులు నలుగురు, ఏఎన్‌ఎంలు తొమ్మిది, ఫిజీషియన్ ఒకటి, అకౌంటెంట్ ఒకటి, యూపీహెచ్‌సీలో ఫార్మాసిస్ట్‌కు ఒక పోస్టు, అలాగే స్టాఫ్ నర్సులు మూడు, మిగతావిభాగాల్లో మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. జూలై10వ తేదీ వరకు ఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ముగిసిన క్రీడాకారుల ఎంపిక

వనపర్తి టౌన్, జూన్ 28 : జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకిష్టయ్య క్రీడాప్రాంగణంలో శుక్రవారం తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఆధ్వర్యంలో 4వ తరగతి ప్రవేశాలకు ఎంపిక నిర్వహించారు. జిల్లా క్రీడ యువజన అధికారి సుధీర్‌కుమార్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో షటిల్‌రన్, ఎత్తు, బరువుతో పాటు మారథన్, 100 మీటర్ల పరుగు పందెం తదితర పోటీలను నిర్వహించి ఎంపిక చేశారు. వివిధ గ్రామాల నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## జోగుళాంబ గద్వాల జిల్లాలో..

గద్వాల అర్బన్, జూన్ 28 : జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో క్రీడా పాఠశాలలోని నాలుగో తరగతిలో ప్రవేశానికి జిల్లా యువజన క్రీడలశాఖ ఆనంద్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు క్రీడాపోటలు నిర్వహించారు. 125మంది హాజరుకాగా వీరికి క్రీడాపోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జితేందర్, కృష్ణయ్య, హైమావతి ఉన్నారు.

## నీట్ పరీక్ష రద్దు చేయాలి

వనపర్తి టౌన్, జూన్ 28 : దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేయాలని డీటీఎఫ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, కార్యదర్శి చిన్నరాములు మాట్లాడుతూ నెట్, నీట్ పరీక్షలు వెంటనే రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. వినతిలో యోసేపు, శ్రీనివాసులు ఉన్నారు.

## గెస్ట్ లెక్చరర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జూన్ 28 : జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి వివిధ సబ్జెక్టుల్లో గెస్ట్ లెక్చరర్ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్ తెలిపారు. బాటనీ 1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ 2, ఇంగ్లిష్ 3, తెలుగు 2 మొత్తం 8 సబ్జెక్టుల్లో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం, పీహెచ్‌డీ, నెట్, సెట్ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. బోధన అనుభవం కలిగిన వారికి వెయిటేజీ ఇస్తామని, అందుకు తమసర్వీస్ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని, బయోడెటా, ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలతో జూలై 3 సాయంత్రం 4గంటల లోగా కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## శోభారాణి బెస్ట్‌మ్యాథ్స్ ప్రిన్సిపాల్ అవార్డు

ఖిల్లాఘణపురం, జూన్ 28 : మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మాలె శోభారాణి ఇండియన్ టాలెంట్ టెస్ట్ ముంబై వారి నుంచి 2023–24 ఉత్తమ బోధనకు గానూ బెస్ట్ మ్యాథ్స్ ప్రిన్సిపాల్ అవార్డును అందుకున్నారు. విద్యార్థులకు బోధన చేస్తూ ఆదర్శంగా ఉన్నందుకు ఇడియన్ టాలెంట్ టెస్ట్ ముంబై పీటీఉష నుంచి అవార్డు లభించిందన్నారు.

## నిత్యాన్నదానానికి విరాళాలు

అలంపూర్, జూన్ 28 : జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదానానికి భక్తులు అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన వెంకట నరసింహ్మా, రమ రూ.50వేలు, హరికిరణ్‌రెడ్డి, క్రాంతి రూ.లక్ష, వెంకట్రావు రూ.లక్ష విరాళాలను ఈవో కార్యాలయంలో అందజేశారు.

## ఆటో బోల్తా

గద్వాల రూరల్, జూన్ 28 : మండలంలోని పుటాన్‌పల్లి స్టేజీ సమీపంలో ఆటో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. గద్వాలలో వివిధ హోటళ్లలో మిగిలిన ఆహార పదార్థాలను సేకరించి వాహనంలో పందులకోసం ఎర్రవల్లికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో వాహనాన్ని పక్కకు పెట్టారు.

## నానో యూరియాతో ఉత్తమ ఫలితాలు

ఇటిక్యాల, జూన్ 28 : రైతులు నానో యూరియాను సాగులో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఏఈవో భరత్ సింహ సూచించారు. శుక్రవారం మండలంలోని చాగాపురం రైతువేదికలో నానో యూరియా వ ల్ల కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించారు.

## న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాలి

- గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

కేటీదొడ్డిలో ఎస్సైను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

ధరూరు, జూన్ 28 : న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించడంలో పోలీసులు ప్రధాన భూమిక పోషించాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రేవులపల్లి గ్రామంలోని ధరూరు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. బాధితుడికి సరైన న్యాయం చేసి వారికి మనపై నమ్మకం కల్గించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్‌తోపాటు సిబ్బంది ఉన్నారు.

**ఫిర్యాదుదారులతో గౌరవంగా ప్రవర్తించాలి**

కేటీదొడ్డి, జూన్ 28 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా ప్రవర్తించాలని ఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. కేటీదొడ్డి మండల పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడారు. జూలై నుంచి అమల్లోకి వచ్చే కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సిబ్బందికి సూచించారు. కేటీదొడ్డి ఎస్సై శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గద్వాలలో 12వ వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్

అమరచింత, జూన్ 28: సీజనల్ వ్యాధులు నివారణకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని, పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అంటు వ్యాధుల నివారణకు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నూరుల్ నదీబ్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 2 వార్డుల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు కృష్ణయ్య, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు ఉన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

గద్వాల టౌన్, జూన్ 28 : వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. వార్డుల్లో నెలకొన్న పారిశుధ్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

**పరిసరాల పరిశుభ్రత పాటించాలి**

మదనాపురం, జూన్ 28 : పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని మండల ప్రత్యేకాధికారి మల్లికార్జున్ అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలోని డబుల్ బెడ్రూం కాలనీలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. రోడ్లపై మురుగును చూసి అసహనం వ్యక్తం చేశారు. కాలనీ వాసులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యరాలు భవాని, సూపర్‌వైజర్ ప్రమీల, ఏఎన్ఎం నర్మద ఉన్నారు.

**ప్రతివార్డులో పారిశుధ్య పనులు**

అయిజ, జూన్ 28 : పట్టణంలోని ప్రతి వార్డులో పారిశుధ్య పనులు విస్తృతంగా చేపట్టాలని సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ దేవన్న సూచించారు. శుక్రవారం పట్టణంలోని 11వ వార్డులో చైర్మన్ పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఫ్రైడే డ్రైడే..**

వనపర్తి టౌన్, జూన్ 28 : వైద్యశాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని 9,18,30వ వార్డులతోపాటు మండలంలోని రాజపేట గ్రామంలో ఫ్రైడే డ్రైడేను నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జంగిడిపురం, రాజపేట గ్రామాలను వారు సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సాయికిరణ్, కుర్మన్న, వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, ఆశ వర్కర్లు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేరులో**

పెబ్బేరు, జూన్ 28: పెబ్బేరు పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ నిల్వ నీటి వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేస్తూ డ్రమ్ములు, టైర్లు, అవుజుల్లో ఉన్న నీటిని పారబోశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తకోటలో చోరీ

- రెండు తులాల బంగారం, 30 తులాల వెండి అభరణాలు అపహరణ

కొత్తకోట, జూన్ 28 : పట్టణంలోని విద్యానగర్ కాలనీ చెందిన మందడి శ్రీనివాసులు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో ఉన్న 2తులాల బంగారు గొలుసు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.1500 నగదును చోరీ చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం శ్రీనివాసులు ఈనెల 25న హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం రాత్రిగుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న ఆభరణాలతో పాటు నగదును చోరీ చేశారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీంతో శుక్రవారం మధ్యాహ్నం ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రాజోళిలో చోరీకి యత్నం

రాజోళి, జూన్ 28 : రాజోళి మండల కేంద్రంలో దొంగలు చోరీకి యత్నించిన ఘటన చోటు చేసుకున్నది. స్థానిక వ్యాపారస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు 5 షాపులలో షెటర్స్‌ను ధ్వంసం చేసి చోరీకి చేసేందుకు యత్నించగా రెండుషాపుల్లో మాత్రం కొంత నగదు, వస్తువులు తీసుకెళ్లినట్లు తెలిపారు.

గ్రామంలో ప్రధానసర్కిల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. కాగా గ్రామంలో కోతులు, అక్రమదందాలు చేసే వ్యక్తులు ధ్వంసం చేయడంతో దొంగలు సులువుగా రాగలుగుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎస్సైని వివరణ కోరగా ఫిర్యాదు ఇవ్వలేదని, ప్రస్తుతం గ్రామంలో ఉన్న షాపులకు సంబంధించిన సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

## నూతన చట్టాలను రద్దు చేయాలి

- బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బార్ అసోసియేషన్ నేతలు

వనపర్తి టౌన్, జూన్ 28 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలను తక్షణమే రద్దు చేయాలని లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వర్, న్యాయవాదుల సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు మోహన్‌యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని కోర్టు ప్రాంగణం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకపక్ష నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. గ్రామ పంచాయతీ మొదలుకొని పార్లమెంట్ వరకు ఉండే సభల్లో తీర్మానాలు తీసుకోలేదని విమర్శించారు. చట్టాలను తక్షణమే రద్దు చేసి పాత చట్టాలనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రతినిధులు , న్యాయవాదులు ఆంజనేయులు, ఎండీ షాకీర్‌హుస్సేన్, చిరంజీవి, కృష్ణయ్య, శంకర్, ప్రవీణ్, నరేందర్, శ్రీనివాసులు, రియాజ్‌అహ్మద్, అనంతరాజ్, రఘు తదితరులు ఉన్నారు.

## విద్యార్థికి సన్మానం

విద్యార్థిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

కొత్తకోట, జూన్ 28 : మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వహీద్ కుమారుడు ఎండీ అహ్మద్ ఈ–సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 21వర్యాంకు సాధించారు. శుక్రవారం హమద్‌ను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శాలువాతో సన్మానించి మిఠాయి తినిపించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, వెంకటేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు అయ్యన్న, రాములుయాదవ్, నాయకులు శ్రీనూజీ, శాంతిరాజ్, వికాస్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## రాజనీతిజ్ఞుడికి ఘన నివాళి

వనపర్తి టౌన్, జూన్ 28 : బహుభాషా కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, సంస్కరణల ఆద్యుడు పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి స్వగృహంలో శుక్రవా రం పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగన్నయాదవ్, కంచె రవి, అశోక్, రహీం ఉన్నారు.

## ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు

వనపర్తి టౌన్, జూన్ 28 : జిల్లాలోని ప్రైవేట్ దవాఖానల్లో ల్యాబ్‌లను శుక్రవారం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.మోతీలాల్ తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రజా వైద్యశాల , సుధా నర్సింగ్‌హోం, రాఘవేంద్రరెడ్డి క్లినిక్‌తోపాటు డయాగ్నొస్టిక్ సెంటర్లను పరిశీలించారు. ఆయుష్ క్లినిక్, ప్రైవేట్ అలోపతి , ప్రతి క్లినిక్‌లో ఎస్టాబ్లిస్‌మెంట్ సేవలు వంటి సౌకర్యాలకు సంబంధించి ప్రతి రిసెప్షన్ వద్ద ధరల పట్టిక ఇంగ్లిష్, తెలుగులో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, విజయభాస్కర్, అశోక్ పాల్గొన్నారు.

## ఎస్సీహాస్టల్‌కు సొంతభవనం నిర్మించాలి

ఉండవెల్లి, జూన్ 28 : మండల కేంద్రంలో ఎస్సీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్సీహాస్టల్‌ను సీఐటీయూ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.

## జూలైలో సదరం క్యాంపులు

గద్వాల, జూన్ 28 : వికలాంగుల అర్హత సర్టిఫికెట్లు కొత్తవి, రెన్యూవల్ పొందేందుకు జూలై నెలలో నిర్దేశిత తేదీల్లో గద్వాలలోని ప్రభుత్వ దవాఖానలో సదరం క్యాంపులను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాఅభివృద్ధి అధికారి నర్సింగరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జూలై 2, 9, 16, 23, 30వ తేదీల్లో కంటి, మానసిక సమస్యలున్న వారికి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. జూలై 3,10, 24, 31వతేదీల్లో అంగవైకల్యం ఉన్నవారికి, జూలై 5, 12, 19, 26వ తేదీల్లో చెవిటి, మూగ వికలత్వం ఉన్నవారికి క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

## కొనసాగుతున్న శిక్షణ

మల్దకల్, జూన్ 28 : మండలకేంద్రంలోని రైతువేదికలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ తరగతులు శుక్రవారం కూడా కొనసాగాయి. శిక్షణకు సీడీపీవో కమలాదేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను సెంటర్లలో అమలు పర్చాలన్నారు. అలాగే సెంటర్లు పరిసరాలు మొత్తం శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీ చర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేయొద్దు

గద్వాల అర్బన్, జూన్ 28 : జిల్లాలోని అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేసి అనంతరం డీఈవో ఇందిరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సంఘ నాయకులు హనుమేశ్,కాశీం, వెంకటేశ్, నరేశ్, ఉరుకుంద్ ఉన్నారు.

## గొర్రెలు, మేకల సంపద లెక్కింపు

గద్వాల రూరల్, జూన్ 28 : జిల్లాలో గొర్రెలు, మేకల సంపదను లెక్కిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.శుక్రవారం మండలంలోని పూడూరు, వీరాపురం, అనంతపురం గ్రామాల్లో పశుసంవర్ధక సిబ్బంది చేస్తున్న గణాంక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గొర్రెలు, మేకల సంపద గణాంక వివరాలపై సమాచారం ప్రభుత్వం సేకరిస్తుందని అందులో భాగంగా వచ్చేనెల 1వ తేదీన ప్రిన్సిపల్ సెక్రటరీ రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారని వివరించారు. ఈ నెల 30వ తేదీలోగా వివరాలు సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో జేవీవో మాధవిలత, భీమయ్య, రాముడు పాల్గొన్నారు.